**కథ**

# నీ మనసు నాకు తెలుసు

**రమ్య చేతికి వాచీ కట్టుకుని టైం చూసింది. అయిదు గంటలు చూపిస్తూంది వాచీ.**

**ఆమెకు క్రితం రోజు ఆఫీసులో అరుణ్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.**

''రమ్యగారూ నేను మిమ్మల్ని మన స్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. మీకిష్టమైతే మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటు న్నాను. మీరు బాగా ఆలోచించి మీ సమాధానం రేపు సాయంత్రం తెలియజే యండి. రేపు సాయంత్రం నేను మున్సి పల్ పార్క్‌లో ఆరు, ఏడు గంటల వరకూ మీ కోసం ఎదురుచూస్తాను. నా ప్రేమను అంగీకరించే పక్షంలో మీరు అక్కడికి వస్తారు. మీరు రాకుంటే నా ప్రేమను మీరు అంగీకరించలేదని భావి స్తాను.''

అద్దంలో ఓసారి తన ముఖాన్ని చూసుకుంది రమ్య.

'తను చక్కగా, తనకే ముద్దొచ్చేలా ఉంది. పైగా ఉద్యోగం చేస్తూంది. ఎవరైనా తనను కళ్లకద్దుకుని చేసుకోవాలి. కానీ ఎందుకో తనకు ఏ సంబంధం కుదరడం లేదు. తనకు నచ్చక కొన్ని సంబంధాలు, తామిచ్చే కట్నం వాళ్లకు నచ్చక మరికొన్ని సంబం ధాలు తప్పిపోయాయి. తనకు ఈ ఏడాది ఇరవై ఏడు వచ్చింది.

అరుణ్ అందగాడు. తన సహోద్యోగి. మంచి వాడు కూడా. మరో ఆడపిల్లయితే అతని ప్రపోజల్ వినగానే ఎగిరి గంతేసి పెళ్లికి ఒప్పుకునేది. కానీ తన కున్న ఆశలు వేరు. ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరుకు భార్య కావాలని, విదేశాలకు వెళ్లి రావాలని, కారు, బంగళా, నగలు కొనాలని తన ఆశ. అరుణ్‌ని చేసు కుంటే తను మధ్యతరగతి మహిళగా మిగిలిపో తుంది. చాలా కోరికలు తీరకుండానే బ్రతుకు తెల్లారిపోతుంది. అందుకే ఉదయం వరకూ పార్క్‌కు వెళ్లాలన్న ఆలోచన తనకు రాలేదు. తర్వాత ఆలోచిస్తే తను పెళ్లి విషయంలో రాజీ పడటం మంచిదనిపించింది. ఇలాగే ఇంకో రెండేళ్లు గడచిపోతే తనకు ఛాయిస్ ఇంకా తగ్గిపో తోంది. తర్వాత రాజీపడి ఎవరో ఒకర్ని భర్తగా అంగీకరించక తప్పదు. ఆ పనేదో ఇప్పుడే చేస్తే మంచిది' అనుకుంది.

తల్లితో స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానని చెప్పి, చక్కగా ముస్తాబు చేసుకుని, చెప్పులు ధరించి ''అమ్మా నేను వెళ్లొస్తాను. తలుపేసుకో'' అంటూ బయటకు వచ్చింది.

బయట పదిహేనేళ్ల కుర్రాడు నిలబడి ఉన్నాడు. రమ్యను చూడగానే ''మూర్తిగారిల్లు ఇదేనా?'' అని అడిగాడు.

అవునన్నట్లు తలూపింది రమ్య.

''ఆయన పేరుతో కొరియర్ వచ్చింది.''

రమ్య సంతకం చేసి కవరు అందుకుని ఇంట్లోకి వచ్చింది.

''అమ్మా, నాన్నకు ఉత్తరం వచ్చింది'' అంది తల్లితో.

''ఎక్కడ్నుంచి?'' లలితమ్మ అడిగింది.

''తెలియదు. కవరు మీద వాళ్ల అడ్రసు రాయ లేదు.''

''కవరు చించి చదువు. ఫర్వాలేదు. ఆయన ఊరి నుంచి రావడానికి ఇంకా నాలుగు రోజులు పడుతుంది. ఏదైనా సంబంధం విషయం అయితే మళ్లీ ఆలస్యమవుతుంది.''

రమ్య కవరు చించి లోపలున్న కాగితాల్ని బయ టకు తీసింది. మొదట ఆమె చేతిలోకి ఓ ఫోటో వచ్చింది. అందమైన యువకుడి ఫోటో అది. తర్వాత బయోడేటా, ఉత్తరం కనిపించాయి.

ఉత్తరం చదవసాగింది రమ్య. అబ్బాయి తండ్రి బద్రీనాథ్ రాసిన ఉత్తరమది. 'తన కొడుకు కిరణ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరని, జీతం నెలకు డెబ్బై వేలని, త్వరలో అమెరికాకు వెళ్లబోతున్నాడని, రమ్యను కిరణ్ ఫంక్షన్‌లో చూశాడని, అతనికి రమ్య ఎంతో నచ్చిందని, మంచిరోజు చూసి చెబితే వచ్చి నిశ్చి తార్థం చేసుకుంటామని' రాశారు.

రమ్య ఆనందానికి అవధులు లేకుండా పోయింది. లలితమ్మ కూడా ఎంతో సంతోషిం చింది.

రమ్య వాచీ తీసి అల్మెరాలో పెట్టి తన గదిలోకి నడిచింది. ఆమె చేతిలో కిరణ్ ఫోటో ఉంది.

★ ★ ★

అద్దం ముందు నిల్చుని తల దువ్వుకుంటు న్నాడు అరుణ్.

''రేపు సాయంత్రం మీ ఇంటికి వస్తున్నాను. మీతో కాస్త పర్సనల్‌గా మాట్లాడాలి''

సుహాసినితో తను అన్న మాటలు గుర్తుకొ చ్చాయి అతనికి.

'తను ఆఫీసులో అత్యధికంగా అభిమానించే వ్యక్తులు రమ్య, సుహాసిని. రమ్యది ఫాస్ట్ నేచర్. సుహాసినిది మైల్డ్ నేచర్. ఇద్దరూ అందగత్తెలే. తనకు మొదట పరిచయమైంది రమ్యతో కాబట్టి ఆమెతో స్నేహం ఎక్కువ తనకు. అందుకే పెళ్లి ప్రపోజల్ ముందుగా రమ్య ముందు పెట్టాడు. ఆమె పార్క్‌కు రాకపోవడంతో చాలా నిరాశప డ్డాడు. ఆమెను తన మనసులోంచి తీసివెయ్యడా నికి చాలా కష్టపడ్డాడు. నెల రోజుల తరువాత తను మామూలు మనిషయ్యాడు. అప్పుడే సుహాసినిని తన జీవితంలోకి ఆహ్వానించాలన్న ఆలోచన వచ్చింది. ఇప్పుడు సుహాసిని ఇంటికి వెళ్లి తన ఆలోచన ఆమెకు చెప్పాలి. ఆమె ఒప్పుకుంటే తను అదృష్టవంతుడే. ఒప్పుకుంటుందన్న నమ్మకం కూడా తనకుంది. తనంటే ఆమె చూపే గౌరవం, తనతో మాట్లాడుతున్నప్పుడు ఆమె కళ్లలో కని పించే మెరుపు, ఆరాధన తను గమనించకపోలేదు' అనుకున్నాడు.

చేతికి వాచీ కట్టుకుని గది తాళం వేసి బయటకు నడిచాడు. రెండు గంటల తరువాత మళ్లీ ఆ గది లోకి అడుగుపెట్టాడు సంతోషంగా.

★ ★ ★

''అరె... సుహాసిని. ఎన్నాళ్లకు వచ్చావు మా ఇంటికి? రారా.. కూర్చో'' అంటూ తన ఇంటికి వచ్చిన స్నేహితురాలిని సంతోషంగా ఆహ్వానిం చింది రమ్య.

కొంతసేపు ఇద్దరూ కబుర్లు చెప్పుకున్నాక ''సుహాసినీ, నీకో గుడ్ న్యూస్ చెప్పాలి'' అంది రమ్య.

''అర్థమైంది. కంగ్రాట్స్ రమ్యా. ఇంతకూ ఈ అందాల రాకుమారిని చేసుకోబోయే ఆ యువ రాజు ఎవరు? ఫోటో ఉందా నీ దగ్గర'' అని అడి గింది సుహాసిని.

రమ్య టేబుల్ సొరుగులాగి అందులోంచి ఫోటో తీసి సుహాసినికి ఇచ్చింది.

సి.ఎస్.చంద్రశేఖర్

ఫోటో చూసిన సుహాసిని షాక్ తిన్నదానిలా ముఖం పెట్టడం చూసి ''ఏయ్ సుహాసినీ. ఏమైంది నీకు?'' అంది రమ్య ఆశ్చర్యంగా చూస్తూ.

సుహాసిని తేరుకుని ''అబ్బ... ఎంత అందంగా ఉన్నాడే? అతని అందం చూసి కళ్లు తిరిగాయి'' అంది నవ్వుతూ.

''మీ అరుణ్ మాత్రం అందగాడు కాదా?''

''అవుననుకో. ఇంతకూ అబ్బాయి నిన్ను చూశాడా? అసలు పెళ్లిచూపులు ఎప్పుడు, ఎక్కడ జరిగాయి?''

''మా ఇంట్లోనే జరిగింది. వారం రోజుల క్రితం. వెంటనే తాంబూలాలు కూడా ఇచ్చిపుచ్చుకున్నాం.''

''ఆయన ఏం ఉద్యోగం చేస్తున్నారు?''

''సాఫ్ట్‌వేర్ ఇంజనీరు.''

''వెరీగుడ్. అనుకున్నది సాధించావు. పెళ్లెప్పుడు?''

''ఫిబ్రవరి ఆరున.''

''బాప్‌రే. నా పెళ్లి కూడా ఆ రోజే కదే. నీ పెళ్లి నేను చూడలేనా?'' బాధగా అంది సుహాసిని.


''చూడగలవు''

''ఎలా?'' ఆశ్చర్యంగా అడిగింది సుహాసిని.

''సి.డి. ప్లేయర్‌లో నా పెళ్లి సి.డి. పెట్టి.''

ఫక్కున నవ్వింది సుహాసిని.

★ ★ ★



తన పెళ్లయిన వారం రోజుల తర్వాత ఓ రోజు అరుణ్‌తో ''మీతో ఓ విషయం చెప్పాలి'' అంది సుహాసిని.

''చెప్పు''

''మీరు రమ్యపై మనసు పడ్డారని నాకు తెలుసు. ఏదో ఒక రోజు ఆమెతో పెళ్లి ప్రస్తావన తెస్తారని కూడా తెలుసు. కానీ రమ్య మీ గురించి చాలా చులకనగా మాట్లాడేది. పైగా కాబోయే భర్త విషయంలో ఆమె ఆశలు ఎక్కడో ఉండేవి. 'ఏ దిక్కూ లేకపోతే అక్క మొగుడే దిక్కు' అన్నట్లు మరే సంబంధం దొరక్కపోతే అప్పుడు అరుణ్ గురించి ఆలోచిస్తాను. ప్రస్తుతానికి నేను కోరుకునేది అమెరికా మొగుణ్ని అనేది. మీ గురించి ఆమె అలా మాట్లాడితే నేను చాలా బాధపడేదాన్ని. ఎందుకంటే మీరంటే నాకు ఎంతో ఇష్టం కనుక. ఒకవేళ ఆమె మీ ప్రేమను అంగీకరించినా మీరు ఆమెతో ప్రశాంతంగా జీవించలేరనిపించేది. ఓ రోజు రమ్య నాకు ఫోన్ చేసి మీరు ఆమె నిర్ణయం కోసం పార్కులో ఎదురుచూస్తారని, తాను కాబోయే భర్త విషయంలో రాజీపడి మీ ప్రపోజల్‌ను 'ఓకే' చేయబోతున్నానని చెప్పింది. నాకు మీ జీవితం అశాంతిపాలు కాకుండా కాపాడాలనిపించింది. నా కోసం వచ్చి జాతకాలు కలవక వదులుకున్న సంబంధాల తాలూకు ఫోటోల్లోంచి ఓ అందమైన అబ్బాయి ఫోటో ఎన్నుకుని, వరుడి తండ్రి రాసినట్లు ఓ ఉత్తరం కంప్యూటర్‌లో టైప్ చేసి, ఉత్తరాన్ని, ఫోటోను నాకు తెలిసిన కొరియర్ అబ్బాయి ద్వారా రమ్యకు పంపాను. నేను ఊహించినట్లే ఆ ఉత్తరం చూడగానే రమ్య తన నిర్ణయాన్ని మార్చుకుంది. అటువంటి 'ఫికిల్ మెంటాలిటీ' ఉన్న రమ్య నుంచి మిమ్మల్ని రక్షించానన్న తృప్తి నాకు కలిగింది. తర్వాత కొద్ది రోజులకు మీరు నాతో పెళ్లి ప్రపోజల్ తెచ్చారు. ఇది నేను ఊహించని విషయం. ఎంతో ఆనందాన్నిచ్చిన విషయం కూడా.''

అరుణ్ ఆసక్తిగా వింటూండటం గమనించి చెప్పడం కొనసాగించింది సుహాసిని.

''నేను రమ్యకు ఫోటో పంపిన విషయం మీతో పెళ్లికి ముందే చెబుదామనుకున్నాను. అయితే అప్పటికి మీతో అంతగా చనువు లేకపోవటంతో చెప్పడానికి భయపడ్డాను. అయితే తప్పు చేసిన భావన నా నుంచి పోవాలంటే మీతో జరిగిన విషయం చెప్పడమే మంచిదనిపించింది. మీ జీవితం హాయిగా సాగిపోవాలనే తపనతో అలా చేశానే తప్ప మిమ్మల్ని ఆమె నుంచి లాక్కోవడానికి మాత్రం నేనేపని చెయ్యలేదు. నన్ను నమ్మండి.'' అంది కళ్లనీళ్లతో.

''ఏయ్... ఎందుకా కన్నీళ్లు? నీ మనస్తత్వం

నాకు తెలియదా? నా సుఖసంతోషాల కోసం ఇంతగా తపించే వ్యక్తి భార్యగా దొరకడం నా అదృష్టం కాదూ'' అన్నాడు ఆమెను దగ్గరగా తీసుకుంటూ.

గువ్వలా అతని కౌగిలిలో ఒదిగిపోయింది సుహాసిని. కొద్ది క్షణాల తర్వాత అతని కౌగిలి విడిపించుకుంటూ-

''అయితే నాకు అత్యంత ఆశ్చర్యాన్ని కలిగించిన విషయం ఒకటుంది'' అంది.

ఏమిటన్నట్లు చూశాడు అరుణ్.

''నేను ఎవరి ఫోటోనైతే రమ్యకు పంపానో అతనితోనే ఆమెకు పెళ్లి కుదిరింది. ఇది ఎలా సాధ్యమైందో నాకు అర్థం కాలేదు.''

''అది నా వల్లే సాధ్యమైంది.''

''మీ వల్లా? ఎలా?'' అంది సుహాసిని ఆశ్చర్యంగా.

''నా ప్రపోజల్‌కు రమ్య 'నో' చెప్పాక కూడా నేను ఆమెతో ఎప్పటిలా స్నేహంగా ఉండసాగాను. పెళ్లంటే ఎవరి ఆశలు, ఆలోచనలు వారికుంటాయి. కాబట్టి నేను ఆమెపై ద్వేషాన్నిగాని, అయిష్టాన్నిగానీ పెంచుకోలేదు. ఒకరోజు ఆమె ఇంటికి వెళితే ఓ అబ్బాయి ఫోటో చూపి, తనతో నిశ్చితార్థం తీసుకోవడానికి ఆ అబ్బాయి తన తల్లిదండ్రులతో వస్తున్నట్లు చెప్పింది. కొద్దిరోజుల తర్వాత చెన్నైలో ఓ పెళ్లిలో ఆ అబ్బాయి నాకు కనిపించాడు. అతన్ని రమ్య విషయం అడిగితే ఆమె ఎవరో తనకు తెలియదని, ఆమె సంబంధం తమ దృష్టికి రాలేదని, తిరుపతి నుంచి సుహాసిని అనే అమ్మాయి సంబంధం మాత్రం వచ్చిందని, జాతకాలు కలవకపోవడం వల్ల ముందుకు వెళ్లలేకపోయామని ఆ అబ్బాయి చెప్పాడు. నాకు జరిగింది చూచాయగా అర్థమైంది. అతనితో రమ్య అందం గురించి చెప్పి ఆమెను చూసేందుకు ఒప్పించాను. నా ప్రయత్నం వల్ల వాళ్లు ఒకరినొకరు చూసుకోవడం, నచ్చి పెళ్లి చేసుకోవడం జరిగింది. నీ వల్ల రమ్యకు తను కోరుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భర్తగా దొరికాడు'' అన్నాడు అరుణ్ నవ్వుతూ.

''మరి మీరు తన పెళ్లి విషయంలో సహాయం చేశారని రమ్య నాకెప్పుడూ చెప్పలేదు'' అంది బాధగా సుహాసిని.

''కొంతమందికి తాము ఫలానా వ్యక్తి నుంచి సహాయం పొందామని చెప్పుకోవడం ఇష్టం ఉండదు. ఇంకొందరు తాము ఇతరులకు చేసిన సహాయం గుర్తుంచుకుంటారు గానీ ఇతరుల నుంచి తాము పొందిన సహాయాలను గుర్తుంచుకోరు. అయితే అవన్నీ పట్టించుకోకుండా ఎవరికైనా సహాయం చేసే అవకాశం మనకు వస్తే గుర్తింపు కోసం ఎదురుచూడకుండా మనకు చేతనైంది సంతోషంగా చెయ్యాలి.''

భర్త వైపు ప్రశంసాపూర్వకంగా చూసి ''రమ్య పెళ్లికి సూత్రధారి మీరే అన్న విషయం కనీసం మీరైనా నాతో ఎందుకు చెప్పలేదు'' అంది.

''చెప్పేవాణ్నే. కానీ నువ్వు రమ్యకు కిరణ్ ఫోటో ఎందుకు పంపావో తెలుసుకోవాలన్న ఆసక్తి నాలో ఉంది. ఏదో ఒక రోజు నువ్వు చేసింది నాతో చెబుతావన్న నమ్మకం కూడా ఉండింది. నువ్వు చెప్పాక నేను చేసింది నీకు చెబుదామనుకున్నాను''

''రమ్యను ఆ రోజు పార్క్‌లో మిమ్మల్ని కలుసుకోకుండా ఆపాను గానీ తర్వాత 'ఓ జంటను విడదీసిన పాపం నాకొస్తుంది కదా! అని బాధపడ్డాను. రమ్యకు కిరణ్‌తో పెళ్లి కుదిరిందని తెలిసి ఎంతో సంతోషపడ్డాను. నా మనసులోని బాధను దూరం చేసిన వ్యక్తి నా భర్తే కావడం నాకెంతో ఆనందంగా ఉంది'' అంది సుహాసిని.

''నా స్నేహితురాళ్ల సుఖసంతోషాల కోసం నా మనసుకు నచ్చిన పని నేను చేశాను. కానీ నా సుఖసంతోషాల కోసం నీ మనసుకు నచ్చని పని నువ్వు చేశావు. కాబట్టే నువ్వే గ్రేట్'' అన్నాడు అరుణ్ నవ్వుతూ.

❀

## గుండెల్లో గులాబీల ముల్లు

**మోడలింగ్‌నుంచి సినీరంగానికి దూసుకొచ్చిన కత్తిలాంటి కత్రినాకైఫ్ ఇప్పుడు తనకు ఎంతో క్రమశిక్షణ అలవడిందంటోంది. మునుపటిలా అంతగా ఎక్స్‌పోజింగ్ చేయడం లేదని, లిమిట్‌గా నటిస్తున్నానంటోంది. బాలీవుడ్‌కొచ్చాక కొంచెం భాషాపరమైన ఇబ్బంది ఏర్పడినా దాన్ని అధిగమనించానని, తెలుగులో నటించడం మొదలెట్టాక క్రమశిక్షణాయుతంగా మెలగడం నేర్చుకున్నానంటోంది కత్రినా. సల్మాన్‌తో వ్యవహారం గురించి అడిగితే మాత్రం గుండెల్లో గులాబీల ముల్లులాంటి నవ్వులు రువ్వుతోంది.**

